# మహాభారతం - మానవ ధర్మం




డా॥ డి.విద్యేశ్వరి | డా॥ ఐ.వి.కాంతలక్ష్మి

# మహాభారతం - మానవధర్మం

డా॥ డి. విద్యేశ్వరి & డా॥ ఐ.వి.కాంతలక్ష్మి

హైదరాబాదు

2012

# మహాభారతం - మానవధర్మం

ప్రథమ ముద్రణ : నవంబర్ 2012

ప్రతులు - 1000

**డా॥ డి. విద్యేశ్వరి**
2-2-3/1/1, శివంరోడ్డు
హైదరాబాదు- 500 044
సెల్: 8106586878

**డా॥ ఐ.వి. కాంతలక్ష్మి**
3-4-866, బర్కత్‌పురా,
హైదరాబాద్- 500 027
సెల్: 9490993532

డిజైన్, బుక్‌మేకింగ్ : జుగాష్‌విలి

డి.టి.పి. : కవిత

**ప్రతులకు**
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,
తెలుగు బుక్‌హౌస్, హైదరాబాద్.

THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF TIRUMALA TIRUPATI DEVASTANAMS, UNDER THEIR SCHEME, "AID TO PUBLISH RELIGIOUS BOOKS. AND THE FINANCIAL AID FROM POTTY SREERAMULU TELUGU UNIVERSITY.

ముద్రణ :
హిమాలయ గ్రాఫిక్స్, చిక్కడపల్లి, హైద్రాబాదు.
ఫోన్: 040- 66100227

**వెల : రూ॥ 150-00**

## విషయసూచిక

### I మొదటి భాగం


1.శ్రీవేదవ్యాసమహర్షి ........................................ 01

2. మహాభారతం - మానవధర్మం ........................................ 06

3.శకుంతలోపాఖ్యానం ........................................ 11

4.నలదమయంతుల కథ ........................................ 16

5.ఉదంకోపాఖ్యానం ........................................ 27

6.ద్రౌపది ధర్మరాజుల సంవాదం ........................................ 36

7.యయాతి చరిత్ర ........................................ 46

8.ధర్మవ్యాధోపాఖ్యానము - వ్యాధగీత ........................................ 56

9.ప్రశ్నల పర్వం - నహుష, యక్ష ప్రశ్నలు ........................................ 71

10.శాపాలు -వరాలు ........................................ 91

11. ధర్మం మారుతుందా? ........................................ 131


### I రెండవ భాగం


12 మహాభారత ప్రబోధిత అధ్యాత్మ ధర్మం ........................................ 163

13. ఆధ్యాత్మిక ధర్మమార్గానుసరణ ........................................ 184

14. కర్మయోగం ........................................ 190

15. జ్ఞానయోగం ........................................ 198

16.భక్తియోగం ........................................ 206

17.ధ్యానయోగం ........................................ 214

18. సన్యాస యోగం ........................................ 219

**3. కృష్ణం వందే జగద్గురుమ్........................................** 223

# మొదటి భాగం

శ్రీ గురుభ్యోనమః

# 1. శ్రీ వేదవ్యాసమహర్షి

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః॥**
**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే**
**నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమోనమః**

మహాభారత ప్రబోధిత ధర్మాన్ని గురించి చర్చించే ముందు వేదధర్మ ప్రబోధ లక్ష్యంతో ఇతిహాస రచన చేసిన వ్యాస మహర్షిని గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. పై శ్లోకాలలో మొదటిది గురువు త్రిమూర్తులతో సాటియైన వాడని, గురువే సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమని వివరిస్తోంది.

రెండవ శ్లోకం వ్యాసుడు ఎవరని అతని వంశాన్ని గురించి తెలుపుతోంది. వ్యాసుడు సాక్షాత్ విష్ణ్వంశసంభూతుడు. విష్ణురూపుడు. విష్ణువే ధర్మ రక్షణకు, ధర్మ ప్రబోధానికి వ్యాసుని రూపంలో దిగివచ్చాడు. ఇతడు వశిష్ఠుని వంశజుడు.

మరొక శ్లోకం వ్యాసుని పూర్తి వివరాలను అందించేది విష్ణు సహస్రనామంలో ఉంది. అది

**వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేఃపౌత్రమకల్మషం**
**పరాశరాత్మజం వందే శుకతాతమ్ తపోనిధిమ్॥**

**తాత్పర్యం:** పరమపవిత్రుడు, తపోనిధి అయిన వ్యాసుడు వశిష్ఠుని వంశజుడు, వశిష్ఠ కుమారుడైన శక్తి మహర్షికి మనుమడు, పరాశరమహర్షి పుత్రుడు, పరమ

నిష్ఠాగరిష్ఠుడు, అధ్యాత్మ విద్యాసంపన్నుడు అయిన శుకునికి తండ్రి అయిన వ్యాసునికి ప్రణామములు.

ద్వాపర కలియుగ సంధికాలంలో ధర్మ భంగం వలన సంభవించే భయంకర యుద్ధం కారణంగా జననష్టం, ధననష్టం జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. అట్టి దుర్దశలో వేదధర్మాన్ని తిరిగి వివరించి, ప్రచారం చేయవలసిన అవసరం ఏర్పడింది. వేదధర్మాన్ని పునః స్థాపించే ప్రయత్నం భారత రణరంగంలో, కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు చేయగా దానిని వ్యాపింప చేసే భారాన్ని కృష్ణద్వైపాయన వ్యాసుడు స్వీకరించాడు.

ఉపరిచరవసు మహారాజు వీర్యసంజనిత, మత్స్యగర్భాన జన్మించిన కన్యపేరు సత్యవతి. దాశరాజు ఇంట పెరుగుతూ తండ్రి లేని సమయాన చుక్కానిచేపట్టి ప్రయాణీకులను గంగానది ఇద్దరి నుంచి అద్దరికి తన నావలో చేరుస్తుంటుంది. విధి విలాసమో, సత్యవతీ ముగ్ధసౌందర్యమో గంగానదిని నావలో దాటుతున్న పరాశరమహర్షిలో ఎనలేని మోహాన్ని కలిగించింది. తన కోరికను ముని వ్యక్తం చేయగా సత్యవతి ఒక ప్రశ్న అడిగింది, 'కన్యాత్వం భంగమైతే తండ్రి ఇంటికి ఎలా వెళ్ళగలను?" అని ప్రశ్నించింది. తండ్రి రక్షణలో ఉన్న కన్య వివాహమైతే భర్తవెంట అత్తవారింటికి వెడుతుంది. మరి మహర్షి వివాహ ప్రసక్తి తేలేదు. అందువలన ఆమెలో ఈ ప్రశ్న కలిగింది. మహర్షి తన సంపర్కం వలన ఆమెకు కన్యాత్వభంగం కలుగకుండునట్లు వరం ఇచ్చి, నదీ మధ్యంలో గల ద్వీపంలో తన మహిమచేత పగలే చీకటిని కల్పించి సత్యవతితో సంయోగాన్ని పొందుతాడు. మహర్షి కోరికను కాదనేందుకు సత్యవతి జంకి ఆయన వాంఛను తీరుస్తుంది. అప్పుడే సత్యవతి సద్యోగర్భం చేత పుత్రుని కన్నది. బాలుడు కృష్ణవర్ణం గలవాడై ఉండటం చేత, ద్వీప మధ్యంలో జన్మించటం చేత కృష్ణ ద్వైపాయనుడని పేరు పొందాడు. జన్మించినంతనే ఎదిగిపోయి, దండకమండలధారుడై "పని కలిగినప్పుడు నన్ను తలచిన అప్పుడు వత్తునని" తల్లికి మ్రొక్కి వెడలిపోతాడు. అట్టి కారణజన్ముడు, మహా తపస్సంపన్నుడు, ధర్మ ప్రబోధకుడు అయిన కృష్ణద్వైపాయనుడు జన్మించిన తిథి ఆషాఢ శుక్ల పౌర్ణమి.

ఇక కృష్ణద్వైపాయనుడు వ్యాసుడైన విధం మరొక గాథ వివరిస్తున్నది. ఈ గాథ భారత, భాగవతాలు రెంటి యందు ఉంది.

సృష్టి సమయంలో నారాయణుడు విధాత చతుర్ముఖాల నుంచి వేదరాశిని కల్పించి బ్రహ్మదేవునికి అందించాడు. ఆ వేదరాశిని ప్రవర్తింపచేయ (ప్రచారంచేయ) విధాత అపాంతరతముడనే మానస పుత్రుని నియోగించాడు. 'వ్యాస' శబ్దానికి విశేషముగా గ్రహించునది, వ్యాపించునది అని అర్థం. 'వ్యాస' శబ్దాన్ని స్థల నిర్దేశంగా ప్రయోగిస్తారు. విశేషముగా గ్రహించేవాడు, విస్తారముగా తెలిసినవాడు అధిష్ఠించే పదవిని వ్యాసమని, ఆపదవిని అధిష్ఠించిన మహాత్ముని వ్యాసుడని పేర్కొన్నారు. (ఇంద్రపదవిని అధిష్ఠించినవాడు ఇంద్రుడు) వేదరాశిని గ్రహించి ప్రవర్తింప చేసిన అపాంతరతమునిని విధాత వేదవ్యాసుడా" అని సంబోధించాడని భారత, భాగవతాలు తెల్పుతున్నాయి.

ఒక్కొక్క యుగంలో యుగ లక్షణాలను అనుసరించి జీవుల శక్తి సామర్థ్యాలు, గ్రహణ, ధారణ శక్తులు క్షీణించటం అనేది యుగధర్మం, అటువంటి స్థితిలో ఏకరాశిగా ఉన్న వేదాన్ని పఠించటం, బోధించటం ధారణ చేయటం కూడా కష్టతరంగా మారిపోయాయి. "ద్వాపరయుగాంతంలో నా అంశతో పరాశర మహర్షికి, సత్యవతికి పుత్రుడవై జన్మించి వేదవిభజన, వేద ప్రచారం, వైదిక ధర్మ ప్రబోధం చేయవలసిన బాధ్యత కూడా నీకు నిర్దేశిస్తున్నానని" విష్ణువే స్వయంగా అపాంతరతమునితో చెప్పినట్లు భారతం వివరించింది.

కృష్ణద్వైపాయనుడు ఏకరాశిగా గల వేదాన్ని ఋక్, యజుర్, సామ, అథర్వ వేదాలుగా విభజించి వేదవ్యాసుడైనాడు. వేదముల ప్రచారాన్ని తన నలుగురు శిష్యులైన పైల, వైశంపాయన, జైమిని, సుమంతులకు అప్పగించాడు. పైలుడు ఋగ్వేదాన్ని, వైశంపాయనుడు యజుర్వేదాన్ని, జైమిని సామవేదాన్ని, సుమంతుడు అథర్వవేదాన్ని ప్రచారం చేశారు. (యజుర్వేదం అనంతర కాలంలో శుక్ల యజుర్వేదమని, కృష్ణయజుర్వేదమని రెండు భాగాలుగా ప్రచారమైంది) వేదాలను (ఋక్కులను) సూత్రీకరించి వ్యాసుడు వ్రాసిన బ్రహ్మసూత్రములను ప్రచారం చేసే బాధ్యతను మరొక శిష్యుడైన రోమహర్షునికి, అష్టాదశ పురాణాలను వ్యాపింప చేసే కర్తవ్యాన్ని రోమహర్షణ పుత్రుడైన సౌతికి నిర్దేశించాడు.

కలియుగారంభానికి ముందే వేద విభజన చేసి, బ్రహ్మ సూత్రముల, అష్టాదశ పురాణముల ప్రచారాన్ని నిర్వహించిన వ్యాసుడు కలియుగంలో తొలిగురువైనాడు. ధర్మవేత్తగా, ధర్మ ప్రచారకుడుగా, వేదనిధిగా, సమకాలికులైన

మహర్షులు, నారదాది దేవమునులు, ధర్మతత్త్వం గ్రహించిన తత్త్వజ్ఞులు కృష్ణద్వైపాయన వేదవ్యాసుని కలియుగంలో తొలి గురువుగా ప్రశంసించారు. సాక్షాత్ శ్రీమన్నారాయణుడే భగవద్గీతలో, సకల చరాచర సృష్టిలో తన అంశ నిక్షిప్తమై ఉన్నదని అర్జునునికి వివరిస్తూ "మునీనామప్యహం వ్యాసః" మునులలో నేను వ్యాసుడను అని స్పష్టంగా చెప్పాడు. భగవద్గీత రూపంలో శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన ఉపనిషత్సారాన్ని వేదవ్యాసుడు మహాభారతం ద్వారా ప్రపంచానికి అందించి "గురుస్సాక్షాత్ పరబ్రహ్మ' అనే వాక్యాన్ని నిరూపించాడు.

ఇంతటి బృహత్కార్యం నిర్వహించిన వ్యాసుడు వేదధర్మం సామాన్యులకు కూడా చేరువకావాలనే ఉద్దేశ్యంతో, ధర్మాచరణ మనిషికి ఎంత అవసరమో, ధర్మ భంగం ఎంతటి అనర్థం కలిగిస్తుందో తెలియజెప్పేందుకే ఇతిహాస రచన చేబూనాడు. మహాభారత యుద్ధం జరిగిన మూడు సంవత్సరాలకు తన కారణంగా వృద్ధి పొందిన కురువంశం అధర్మపరుల మూలంగా ఎలా నశించి పోయిందో భారతంలో స్పష్టంగా చిత్రించాడు. ధర్మవర్తన ఎంత ఆవశ్యకమైనదో మహాభారతంలో వ్యాసుడు అడుగడుగునా వివరించాడు. అందువలననే భారతం పంచమవేదంగా ప్రసిద్ధిపొందింది. ధర్మం యొక్క ఆవశ్యకతను గురించి వ్యాసుడు వివరించిన సూక్తులలో కొన్ని-

1) లోకయాత్రార్థమేవ ధర్మస్య నియమాః కృతః = లోక యాత్రకొరకే ధర్మము యొక్క నియమములు చేయబడినవి.

2) లోక సంగ్రహ యుక్తః విధాతా విహితం పురా= లోక సంగ్రహము కొరకే (గ్రహించుటకే) పూర్వము బ్రహ్మ (ధర్మమును) ఏర్పరచినాడు.

3) ప్రభవార్థాయ భూతానామ్ = భూతముల (జీవుల) అభివృద్ధి కొరకే (ధర్మము) నిర్ణయము చేయబడినది.

వేదధర్మ వ్యాప్తికి కలియుగంలో ఆద్యుడైన వ్యాసముని నిర్గుణ పరబ్రహ్మో పాసనకు, ఆత్మజ్ఞాన సిద్ధికై బ్రహ్మ సూత్రములను, సగుణోపాసనకు, భగవద్గీతలో వాసుదేవుడు బోధించిన కర్మజ్ఞాన భక్తి యోగాలకు తగినట్లుగా, సామాన్యులు కూడా పారాయణ చేసుకో గలిగిన శివ, విష్ణు సహస్రనామాలను, దేవీస్తుతులను, మరెన్నో స్తోత్రాలను మహాభారతం ద్వారా మానవాళికి అందించాడు. మహాభారతంద్వారా ధర్మ స్వరూపాన్ని, ధర్మాచరణ ప్రయోజనాన్ని, బ్రహ్మ

సూత్రములు, భగవద్గీతల ద్వారా ఆత్మజ్ఞానాన్ని బోధించిన తొలిగురువు కృష్ణ ద్వైపాయన వ్యాసమహర్షి. అందువలన ఆయన జన్మించిన ఆషాఢ శుక్ల పూర్ణిమ గురు పూర్ణిమ, వ్యాస పూర్ణిమగా పేరుపొంది గురుపూజోత్సవ దినమైనది. కర్మ భూమియైన భారతదేశంలో తొలిగురువుగా వ్యాసుని పూజించటం, గురుపూజోత్సవం నిర్వహించటం అనూచానంగా వస్తున్న సంప్రదాయం.

చిరంజీవి యైన వ్యాసునికి బాదరాయణుడనే మరొక పేరు కూడా ఉంది. వ్యాసుడు జన్మించిన ద్వీపంలో బదరీవృక్షాలు అధికంగా ఉండటం వలన ఈ పేరు వచ్చిందనీ; ఇంకా వ్యాసుడు హిమాలయాలలోని బదరీవనంలో ఆశ్రమం ఏర్పరచుకుని తపస్సుచేసి, నిష్కామ కర్మయోగంతో యజ్ఞయాగాలు నిర్వహించి సత్యము, నిత్యము అయిన పరబ్రహ్మను దర్శించినందు వలన బాదరాయణుడని పేరు పొందాడని, పెద్దలు చెప్తుంటారు.

పురాణ వాఙ్మయాన్ని అనుసరించి వైవస్వత మన్వంతరంలో 27గురు వ్యాసుల కాలం గడిచిందని, నారాయణాంశతో సత్యవతీ పరాశరుల కుమారుడైన కృష్ణ ద్వైపాయనుడు 28వ వ్యాసుడని తెలుస్తున్నది. రాబోయే “మనుసావర్ణి” మన్వంతరంలో వ్యాసుడు సప్తఋషులలో ఒకడు కాగలడని కూడా పురాణాలు వర్ణించాయి.

**శ్లో॥ నమోస్తుతే వ్యాస విశాలబుద్ధే। ఫుల్లారవిందాయత పత్రనేత్ర**
**యేన త్వయా భారతతైల పూర్ణః। ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥**

**తాత్పర్యం:** ఓ విశాలబుద్ధీ, విరిసిన అరవిందముల రేకులవంటి కన్నులు గల వ్యాసమహర్షీ! భారతమనే తైలముతో నిండిన జ్ఞానమనే దీపాన్ని వెలిగించిన నీకు నమస్కారము.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2261**

* * *